ఎన్‌సీసీకి 3,389 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, నవంబర్ 29: రాష్ట్రానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్‌కి మరో అతిపెద్ద ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. కెన్-బెట్వా లింక్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న రూ.3,389.49 కోట్ల విలువైన దౌధన్ డ్యామ్ ఆర్డర్ లభించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ భారీ ఆర్డర్‌కు సంబంధించి నిర్వహించిన బిడ్డింగ్‌లో సంస్థ తక్కువ కోడ్ చేసి దక్కించుకున్నదని వెల్లడించింది. ఈ ఉత్తర్వులను వచ్చే 72 నెలల్లో(ఆరేండ్లలో) అమలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రాజెక్టునకు సంబంధించి ప్లానింగ్, డిజైనింగ్, ఇంజినీరింగ్, హైడ్రో-మెకానికల్ పనులు ఈపీసీ(ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్‌ట్రక్షన్) నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది.

బీఎండబ్ల్యూ బైకులు ప్రియం

న్యూఢిల్లీ, నవంబర్ 29: లగ్జరీ కార్ల సంస్థ బీఎండబ్ల్యూకి చెందిన ద్విచక్ర వాహన డివిజన్ బీఎండబ్ల్యూ మోటోరాడ్ కూడా తన వాహన ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1, 2025 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల ద్విచక్ర వాహన ధరలను 2.5 శాతం వరకు పెంచుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కారణంగా ధరలను పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

స్కిల్ వర్సిటీలో భాగస్వామ్యం కండి

విప్రో ప్రతినిధులతో శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విప్రో సంస్థ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో విప్రో కార్యకలాపాల పురోగతిని వివరించేందుకు ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి రాఘవ్ స్వామినాథన్ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విప్రో సంస్థకు అవసరమయ్యే వారికి స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చి నియమించుకోవాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఇదే తరహాలో 80 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల పరిశ్రమలను ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటు చేయాలని రాఘవ్‌ను కోరారు.

వృద్ధికి బీటలు

రెండేండ్ల కనిష్ఠానికి జీడీపీ పతనం

జూలై-సెప్టెంబర్‌లో 5.4 శాతమే • తయారీ, గనుల రంగాలు పేలవం • వినిమయ శక్తి బలహీనం

న్యూఢిల్లీ, నవంబర్ 29: దేశ ఆర్థిక వృద్ధిరేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి దిగజారింది. శుక్రవారం విడుదలైన జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) వివరాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో జీడీపీ 5.4 శాతానికే పరిమితమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 4.3 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ దరిదాపుల్లో వృద్ధి గణాంకాలుండటం ఇప్పుడే. కాగా, తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ఇది 6.7 శాతంగా ఉంటే.. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.1 శాతంగా ఉండటం గమనార్హం. దీంతో కాలం గడుస్తున్నకొద్దీ వృద్ధిరేటు అంతకంతకూ పడిపోతున్న సంకేతాలే కనిపిస్తున్నాయి.

తయారీ, గనులు నిరాశాజనకం..

తయారీ, గనుల రంగాల పనితీరు నిరాశాజనకంగా ఉన్నట్టు తాజా గణాంకాల్లో తేలింది. తయారీ రంగ కార్యకలాపాలు 2.2 శాతానికి, గనుల రంగంలో ఉత్పాదకతైతే 0.01 శాతానికి క్షీణించాయి. ఏడాది క్రితం ఇవి వరుసగా 14.3 శాతంగా, 11.1 శాతంగా ఉండటం విశేషం. రియల్టీ తదితర రంగాల్లో వృద్ధి పెరిగినా అది స్వల్పమే. ఇక వినియోగదారుల కొనుగోలు శక్తి సైతం పడిపోయినట్టు స్పష్టమవుతున్నది. ఈ ఏప్రిల్-జూన్‌లో 7.4 శాతంగా ఉంటే, జూలై-సెప్టెంబర్‌లో 6 శాతంగానే ఉన్నది. దేశ జీడీపీ బలంగా ఉండాలంటే మార్కెట్‌లో డిమాండ్ ముఖ్యం. కానీ వినిమయ శక్తి తగ్గిపోతే డిమాండ్ కూడా ఉండదు.

బేస్ ఇయర్ మార్పు!

జీడీపీ కంప్యూటేషన్ కోసం బేస్ ఇయర్‌ను 2022-23కు మార్చాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు యోచిస్తున్నది. అంతా కుదిరితే 2026 ఫిబ్రవరి నుంచి ఇది అమల్లోకి రావచ్చంటున్నారు. బేస్ ఇయర్ మారితేనే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి కచ్చితమైన సమాచారం వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కాగా, ప్రస్తుతం 2011-12 బేస్ ఇయర్‌గా ఉన్నది. ఈ సంవత్సరంలోని ధరల ఆధారంగానే వృద్ధిరేటును లెక్కిస్తున్నారు. గతంలో ఇది 2004-05గా ఉండేది. ఇదిలావుంటే వచ్చే జనవరి నుంచి నెలనెలా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే అంచనాలుంటాయని కేంద్ర గణాంకాలు, ప్రణాళిక అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్ తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికిగాను అక్టోబర్ నెల ముగిసే నాటికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక లోటు పూర్తి ఏడాదికాల లక్ష్యంలో 46.5 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఆదాయ-వ్యయాల మధ్య వ్యత్యాసాన్నే ఆర్థిక లోటుగా పరిగణిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దీన్ని రూ.16,13,312 కోట్లకు కట్టడి చేయాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే తొలి ఏడు నెలల్లో రూ.7,50,824 కోట్లకు వచ్చింది.

రెండో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 5.4 శాతానికి క్షీణించడం అసంతృప్తికరమే. అయినప్పటికీ మొత్తం ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 6.5 శాతం లక్ష్య సాధనకు వచ్చిన ముప్పేమీ లేదు.

-వీ అనంత నాగేశ్వరన్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు

జూలై-సెప్టెంబర్‌లో జీడీపీ వృద్ధిరేటు ఊహించినదాని కంటే బాగా తగ్గిపోయింది. కీలక రంగాల్లో నిస్తేజం కనిపించింది. తయారీ, గనుల రంగాల్లో ఉత్పాదకత రేటు మరీ దారుణంగా నమోదైంది.

-అదితి నాయర్, ఐసీఆర్ఏ ప్రధాన ఆర్థికవేత్త

మెప్పించని మౌలికం

బొగ్గు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తుల రంగాల్లో ఉమ్మడి వృద్ధిరేటు ఈ ఏడాది అక్టోబర్ నెలలో క్షీణించింది. 3.1 శాతంగానే ఉన్నట్టు తాజా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో ఈ 8 కీలక రంగాల ఉత్పాదకతలో వృద్ధిరేటు 12.7 శాతంగా నమోదు కావడం గమనార్హం. ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి క్షీణించినట్టు స్పష్టమైంది. కాగా, ఈ ఏప్రిల్-అక్టోబర్ మధ్య ఈ రంగాల వృద్ధిరేటు 4.1 శాతం వద్దే ఆగిపోయింది. నిరుడు ఇదే వ్యవధిలో 8.8 శాతంగా ఉన్నది. దేశ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండగా, వీటి పనితీరు ఐఐపీని గట్టిగానే ప్రభావితం చేస్తుంది.

విమానాల్లో బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు

20 శాతం వరకు ఎయిర్ ఇండియా ఆఫర్ • రూ.1,199కే ఇండిగో ప్రారంభ టికెట్

న్యూఢిల్లీ, నవంబర్ 29: విమాన ప్రయాణికులను ఆకట్టుకోవడానికి పలు విమానయాన సంస్థలు ప్రత్యేకంగా 'బ్లాక్ ఫ్రైడే సేల్స్' ఆఫర్లను ప్రకటించాయి. దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోతోపాటు ఎయిర్ ఇండియా ఈ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. దీంట్లో ఇండిగో ఒకవైపు ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,199గా నిర్ణయించింది. అంతర్జాతీయ రూట్‌లో రూ.5,199కే అందిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జనవరి 1 నుంచి మార్చి 31, 2025లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. అలాగే ఎయిర్ ఇండియా విమాన టికెట్ల బేస్‌రేట్‌పై 20 శాతం వరకు తగ్గింపు ధరకు విక్రయిస్తుండగా..అంతర్జాతీయ రూట్లపై 12 శాతం తగ్గింపునిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూన్ 30, 2025 లోపు ప్రయాణించాల్సి ఉంటుంది. భారత్ నుంచి ఆస్ట్రేలియా లేదా ఉత్తర అమెరికాల మధ్య మాత్రం అక్టోబర్ 30, 2025 లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని, లిమిటెడ్ సీట్లు ఉండగా, తొలుత వచ్చిన వారికి మాత్రమే ఈ ఆఫర్ లభించనున్నదని పేర్కొంది. ఈ ఆఫర్లు డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉండనున్నాయి.

సబ్బుల ధరలకు రెక్కలు

8% వరకు పెంచిన ఎఫ్ఎంసీజీలు • పామాయిల్ ధరలు పెరగడం వల్లనే..

న్యూఢిల్లీ, నవంబర్ 29: సబ్బుల ధరలకు రెక్కలొచ్చాయి. దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ సంస్థలు అన్ని రకాల సబ్బుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పామాయిల్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం వల్లనే వీటి ధరలను 7 శాతం నుంచి 8 శాతం వరకు పెంచాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, విప్రో సంస్థలు ప్రకటించాయి. సబ్బుల తయారీలో కీలక ముడి సరుకైన పామాయిల్ ధర అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమన్నది. దీంతో పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి సబ్బుల ధరలు పెంచకతప్పలేదని సంస్థలు పేర్కొన్నాయి. మార్జిన్లు తగ్గుముఖం పట్టడంతో వీటి ధరలను ప్రస్తుత త్రైమాసికంలో పెంచాల్సి ఉంటుందని గత త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు సందర్భంగా ప్రకటించాయి కూడా. సబ్బుల తయారీలో కీలక ముడిసరుకైన పామాయిల్ ధరలు గడిచిన ఏడాదికాలంలో 30 శాతం వరకు పెరిగాయని విప్రో కన్స్యూమర్ కేర్ సీఈవో నీరజ్ ఖత్రియా తెలిపారు. మిగతా సంస్థలు కూడా తమ సబ్బుల ధరలను 7-8 శాతం వరకు పెంచుతాయని అనుకుంటున్నట్లు చెప్పారు. గడిచిన మూడు నెలల్లోనే పామాయిల్ ధరలు 35 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతోపాటు దిగుమతి సుంకం పెరగడం ఇందుకు కారణం. ప్రస్తుతం పది కిలోల పామాయిల్ ధర రూ.1,370గా ఉన్నది.

టీ పొడి ధరలు కూడా..

టీ పొడి ధరలు కూడా పెంచాయి సంస్థలు. అస్థిర వాతావరణ పరిస్థితుల కారణంగా టీ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్లనే ధరలు సవరించాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, టాటా కన్స్యూమర్ సంస్థలు ప్రకటించాయి. టీ పొడి ధరలను 25 శాతం నుంచి 30 శాతం వరకు సవరించినట్లు టాటా కన్స్యూమర్ ప్రాడక్ట్ ఇప్పటికే ప్రకటించింది కూడా.

- **విప్రో కన్స్యూమర్ కేర్..సంతూర్, చంద్రిక పేర్లతో సబ్బులను విక్రయిస్తున్నది.**
- **హెచ్‌యూఎల్..డోవ్, లక్స్, లైఫ్‌బాయ్, లిరిల్, పీయర్స్, రెగ్జోనా బ్రాండ్లతో సబ్బులను అమ్ముతున్నది.**
- **లక్స్ సబ్బు (5 సబ్బులు) ప్యాక్ ధర రూ.145 నుంచి రూ.155కి పెరిగింది.**
- **లైఫ్‌బాయ్(5 సబ్బులు) ప్యాక్ విలువ రూ.155 నుంచి రూ.165కి పెంచారు.**
- **ఐదు ప్యాక్ కలిగిన పీయర్స్ సబ్బుల ధర రూ.149 నుంచి రూ.162కి సవరించారు.**

రూపీ.. ఆల్‌టైమ్ లో

ఒక్కరోజే 13 పైసలు పతనం • 84.60 వద్దకు మారకపు విలువ క్షీణత

ముంబై, నవంబర్ 29: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ శుక్రవారం ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. ఈ ఒక్కరోజే 13 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా భారతీయ కరెన్సీ 84.60 వద్దకు క్షీణించింది. దేశ జీడీపీ వృద్ధిరేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి పతనం కావడం.. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను అదేపనిగా ఉపసంహరించుకుంటుండటం ఓవరాల్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ఫారెక్స్ మార్కెట్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. దీనికితోడు దేశంలోని దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ కూడా రూపీని బలహీనపర్చిందని చెప్తున్నారు. నిజానికి ఇటీవలికాలంలో డాలర్ ముందు రూపీ వెలవెలబోతూనే ఉన్నది. ఒక్కరోజే 10 పైసలకుపైగా క్షీణించిన సందర్భాలు అనేకం ఉన్నాయంటే కరెన్సీ మార్కెట్‌లో రూపాయి ఎదుర్కొంటున్న ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. రూపాయి విలువ ఇలాగే పడిపోతే ఆ ప్రభావం.. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు, జీడీపీలపై గట్టిగానే పడవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

భారీ నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం కోలుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 759.05 పాయింట్లు లేదా 0.96 శాతం ఎగిసి 79,802.79 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 880.16 పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 216.95 పాయింట్లు లేదా 0.91 శాతం ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,131.10 వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, టెలీకమ్యూనికేషన్స్, ఎనర్జీ, టెక్నాలజీ షేర్లు రాణించాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.76 శాతం, మిడ్‌క్యాప్ 0.31 శాతం మేర పుంజుకున్నాయి. గురువారం సెన్సెక్స్ 1,190, నిఫ్టీ 361 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

తగ్గిన విదేశీ నిల్వలు

ముంబై, నవంబర్ 29: విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. ఇప్పటికే భారీ స్థాయిలో కరిగిపోయిన నిల్వలు ఈ నెల 22తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 1.31 బిలియన్ డాలర్లు తగ్గి 656.582 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 17.761 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడం వల్లనే రిజర్వులు తగ్గుతున్నాయని తెలిపింది. వీటి విలువ 3.043 బిలియన్ డాలర్లు తరిగిపోయి 566.791 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే గోల్డ్ రిజర్వులు మాత్రం 1.828 బిలియన్ డాలర్లు పెరిగి 67.573 బిలియన్ డాలర్లకు చేరాయి.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, నవంబర్ 29 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువతీ యువకులు తెలంగాణ ప్రభుత్వం నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ గవర్నమెంట్ తెలంగాణ సినిమా టెక్నాలజీ అండ్ సాఫ్ట్‌వేర్ కోర్స్‌కు సంబంధించి నోటిఫికేషన్ విడదల చేసిందని అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం తెలిపారు. దీనిలో భాగంగా సినిమాటోగ్రఫీ మాస్టారి, డిజిటల్ డిజైన్ అండ్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, యాంకరింగ్ అండ్ ఈఎంసీఈఈ డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్స్, మ్యూజిక్ ప్రొడక్షన్ మాస్ ట్రీ ప్రొఫెషనల్ ప్రొడక్షన్ మాస్టారి,ప్రొఫెషనల్ గానం శిక్షణ, అన్నింటి డిజైనింగ్ నైపుణ్యం మొదలగు కోర్సులకు నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు.మూడు నెలల కోర్సుకు సంబంధించి మూడు విడుతలుగా రూ.35000 ఫీజు నిర్ణయించిందని తెలిపారు. ఆసక్తి గల వారు డిసెంబర్ 2వ తేదీలోగా న్యాక్ కార్యాలయం ఆదిలాబాద్ ఇన్‌చార్జి ఎం మహేశ్ కుమార్ 9154548063ను సంప్రదించాలని సూచించారు.

బ్లేడ్‌తో చేయికోసుకొని ఆత్మహత్యాయత్నం

ఇంద్రవెల్లి, నవంబర్ 29 : మద్యం తాగిన మైకంలో బ్లేడ్‌తో చేయి చేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌లో చోటు చేసుకుంది. మిలింద్‌నగర్ వాసులతో పాటు ప్రత్యేక సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్‌లోని చిలుకురినగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంద్రవెల్లిలోని ఓ యువతితో ప్రేమ వివాహం చేసుకొని ఆదిలాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. భార్యభర్తల మధ్యలో జరిగిన గొడవల కారణంగా భార్య నెల రోజుల క్రితం నుంచి తల్లిదండ్రుల ఇంట్లో ఉంటుంది. భార్య తనకు దూరంగా ఉంటుందని ఇంటికి రావడం లేదని మిలింద్‌నగర్‌కు వచ్చాడు. వారంరోజుల నుంచి మద్యం తాగి భార్యతో గొడవ పడుతున్నాడు. శుక్రువారం కూడా మద్యం తాగి భార్యతో గొడవ పడి బ్లేడ్‌తో చేయి కోసుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే ఎస్ఐ సునీల్‌కు సమాచారం అందించారు. ముందుగా ఇంద్రవెల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108తో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ సునీల్‌కు సంప్రదించగా తాగినమైకంలో అతను పేరు కుటుంబ సభ్యుల వివరాలు చెప్పడం లేదని, కుటుంబీకులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తానని తెలిపారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎదులాపురం, నవంబర్ 29 : రాజ్యాంగ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ బహుజన ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ గొల్లమండల పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఛలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్, నాయకులు బిట్ల చైతన్య, ఆకాశ్ పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనపై శిక్షణ

జైనథ్, నవంబర్ 29: జైనథ్ పీహెచ్‌సీలో కుష్ఠు నిర్మూలన కోసం శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో కుష్ఠు లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గిమ్మ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుచల మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి 15 వరకు సర్వే చేసి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో రామిరెడ్డి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 29 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, రక్తహీనత నివారణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో నాగలక్ష్మి, సీడీపీవోలు నాగమణి, సరిత, సరోజిని, జిల్లా సమన్వయకర్త నిరంజన్ రెడ్డి, అంగన్‌వాడీల సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ లేనిది తెలంగాణ లేదు

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తలమడుగు: మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తలమడుగు, నవంబర్ 29: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం శుక్రవారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, జిల్లా ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీలో కేసీఆర్‌తో పాటు ఉద్యమకారుల చిత్రాలను వీక్షించి ఉద్యమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేసీఆర్ ఉద్యమం,10 ఏండ్ల తెలంగాణ అభివృద్ధి డాక్యుమెంటరీని వీక్షించారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ నేరడిగొండ నుంచి కార్యకర్తలతో కలిసి భారీ కాన్వాయ్‌తో ఆదిలాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక పోరాటాల తర్వాత కాంగ్రెస్ వైఖరిని నిలదీస్తూ కేసీఆర్ సచ్చుడో - తెలంగాణ వచ్చుడో అనే నినాదానికి దార పోసి 2009 నవంబర్ 29న తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ ఆనాడు ఆమరణ నిరాహారదీక్షకు శ్రీకారం చుట్టారని ఆరోజు తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన అపూర్వ ఘట్టమన్నారు. యావత్ తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసిన దీక్షా అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను తెగించిన దీక్ష అని అన్నారు. తెలంగాణను ఇప్పుడు కాంగ్రెస్ చేతిలో ఆగం కానివ్వొద్దని కార్యకర్తలందరు ఎక్కడిక్కడ నిలదీస్తూ ఉండాలని, ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ హామీని నిలబెట్టుకోవాలి

నార్నూర్: నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు

నార్నూర్, నవంబర్ 29 : సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉ ద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు జాదవ్ వినోద్ మాట్లాడుతూ చాలిచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వాపోయారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగస్తులు శైలజ, వైద్యనాథ్, శంకర్, సుధాకర్, సుభాష్, గోవింద్, నగేశ్, వామన్, కైలాష్, దేవీదాస్, హిమబిందు, లక్ష్మి, సౌజన్య, వందన, పద్మ, తిరుమల పాల్గొన్నారు.

భైంసా, నవంబర్ 29 : భైంసాలోని తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం కేజీబీవీ ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ. 20 లక్షలు, ఆరోగ్య బీమా రూ. 10 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జ్యోతి, విష్ణు, నరేశ్ పాల్గొన్నారు.



భైంసా: నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

తుకారాంను ఆదర్శంగా తీసుకోవాలి

ఉట్నూర్ రూరల్, నవంబర్ 29: దివంగత మడావి తుకారాంను ఆదర్శంగా తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. తుకారాం వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని లక్షెట్టిపేట ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు ఆయన విగ్రహానికి ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంత్‌రావ్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోహర్, తుకారాం కుటుంబ సభ్యులు, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, సలాం శ్యాంరావ్, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, తుడుందెబ్బ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురావ్, వివిధ సంఘాల, రాజకీయ, ఆదివాసీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుకారాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. లక్షెట్టిపేట గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల, వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహ పరిసరాలు, పాఠశాల తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు వడిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దంతన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంత

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంత లభిస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శంకర్‌తండా గ్రామంలో నిర్వహించిన సస్తాహ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తిర్‌పెల్లి శివారులో పులి సంచారం పుకారే

లక్ష్మణచాంద, నవంబర్ 29: లక్ష్మణచాంద మండలం తిర్‌పెల్లి, మామడ మండలం కొరిటికల్‌లో పులి సంచరిస్తున్నట్లు వచ్చిన వందంతులు ఉట్టి పుకార్లేనని అటవీ శాఖ అధికారులు తేల్చారు. తిర్‌పెల్లి గ్రామంలోని అటవీ సమీపంలో గురువారం రాత్రి పులి సంచరిస్తున్నట్లు వదంతులు వ్యాపించాయి. శుక్రవారం ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పులికి సంబంధించిన సమాచారాన్ని అన్వేషించి పులి సంచారం లేదని తేల్చారు. ప్రస్తుతం దిమ్మదుర్తి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు తెలిపారు. పులి రోజుకు 25 నుంచి 50 కిలోమీటర్లు సంచరించే అవకాశం ఉండడంతో పులి వచ్చే అవకాశం ఉం టుందని తెలిపారు. పశువుల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని ఆయనతో పాటు అటవీ శాఖ, పోలీసు సిబ్బంది పరిశీలించారు.

దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్రం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ,సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

ఎదులాపురం, నవంబర్ 29 : దేశ సంపదను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నదని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. ఆదిలాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ మౌలిక సూత్రలకు తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు. దేశ సంపదని అదాని, కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. అంబేద్కర్‌ను పొగుడుతూనే మరో వైపు రాజ్యాంగాన్ని తొక్కిపెడుతోందని పేర్కొన్నారు. బీజేపీ ద్వంద్వ విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. ఆదిలాబాద్‌లో సీసీఐని తెరిపించాలని, ఆదిలాబాద్ -ఆర్మూర్ రైల్వే లైన్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవి కుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, నాయకులు ఆశన్న, మంజుల జమున, భీంరావ్, సోమేశ్, విష్ణు పాల్గొన్నారు

ఆశ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 29 : ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఆశ కార్యకర్త యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా నిర్మల్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి టీఎన్జీవోస్ భవనం వరకు ర్యాలీ తీశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు శశికళ జండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు పని ఒత్తిడిని తట్టుకొని నిత్యం సేవలు అందించడం వల్ల తెలంగణ రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డ్స్, రివార్డ్స్ పొందారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు నష్టం చేసే కార్మిక లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలన్నారు. ఆశ కార్యకర్తలకు యూనిఫాం, గుర్తింపుకార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశ కార్యకర్తల రాష్ట్ర బస్సుయాత్ర డిసెంబర్ 15న నిర్మల్ నుంచే ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్, కిషన్‌కుమార్, సభ్యులు పోశెట్టి, యూనియన్ నాయకులు సుజాత పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల యూనియన్ కార్యవర్గం

ఆశ కార్యకర్తల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షురాలిగా బీ సుజాత, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, విజయ, సరిత, ఇంద్రమాల, అనసూర్య, సుగుణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పీ గంగమణి, సహాయ కార్యదర్శిగా శ్యామల, సులోచన, విజయ, జ్యోతి, పద్మ, కోశాధికారిగా రామలక్ష్మి ఎన్నికయ్యారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య

బాసర, నవంబర్ 29 : బాసర రైల్వే వంతెన సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. శుక్రవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. దాదాపు 65ఏళ్ల వయస్సు ఉంటుందని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే బాసర పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు. లేదా 8712649540 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పాలని సూచించారు.